క్లుప్తంగా

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పెనమలూరు: పోరంకిలో ఆదివారం 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని అక్షిత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు, చిన్నపిల్లలు, అలర్జీ, థైరాయిడ్ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సాధన, డాక్టర్ ఉదయ్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యం చేయించుకుంటే వ్యాధులు తగ్గుతాయని వైద్యులు సూచించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం

పెనమలూరు: కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. గోసాలలో కోనేరు ట్రస్టు వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 19 మంది విద్యార్థినులు, ఏడుగురు విద్యార్థులకు కోనేరు ట్రస్టు రూ. 2.48 లక్షలు పారితోషికం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ ప్రసాద్ అందచేశారు. జోనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ అన్నిదానాల్లో కంటే విద్యా దానం చాలా గొప్పదని చెప్పారు. విద్యార్థులు ప్రతిభ చాటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్టు కార్యదర్శి కోనేరు భీమేశ్వరరావు మాట్లాడుతూ 2010లో తన తండ్రి ఇచ్చిన రూ.51 వేలతో ప్రారంభమైన విద్యానిధిలో ఇప్పుడు రూ.35 లక్షలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 133 మందికి రూ.12.75 లక్షలు సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, కోశాధికారి శివాజీ, వ్యవస్థాపక ట్రస్టీలు నారాయణరావు, వాసుదేవరావు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ట్రస్టు సభ్యులు, స్థల దాతలు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



రామవరప్పాడు: ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు బుద్దా వెంకటేశ్వరరావు అన్నారు. అరుణాచలంలోని వాసవి నిత్యాన్న సత్రం ఉపాధ్యక్షులుగా గొంట్ల రామ్మోహన్ రావు, మద్దాలి శ్రీనివాస్ కుమార్, సహాయ కార్యదర్శులుగా ముచ్చర్ల శ్రీనివాస్, కొల్ల అనీల్ ప్రసాద్ ఎన్నికైన సందర్భంగా ఎనికేపాడులో సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన సత్కరించారు. కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు కొలిపర్తి లక్ష్మీనారాయణ, పేర్ల సురేష్, పుల్లారావు, ఆనందరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. వణుకూరు గ్రామ శివారులో పేకాటాడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారని వారి నుంచి రూ.61 వేల సొమ్ము స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: అనారోగ్యంతో ఉన్న వ్యక్తి అదృశ్యం కాటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక అన్నపూర్ణ రెసిడెన్సీలో శంకరశెట్టి ముఖేష్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని తండ్రి శంకరశెట్టి దుర్గాప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే శనివారం దుర్గాప్రసాద్ ఇంటి నుంచి బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు స్థానికులను విచారించగా దుర్గాప్రసాద్ ఇంటి ఎదురుగా ఉన్న కేఈబీ కెనాల్‌లో దిగాడని తెలిపారు. దీంతో కాలువలో గాలింపు చేపట్టారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో కుటుంబ తగాదాలతో వ్యక్తి అదృశ్యం కావటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరపు నవీన్ పెదపులిపాక గణపతినగర్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అయితే అతని తండ్రి రమణయ్య (50) ఇంట్లో కుటుంబ సభ్యులతో తగాదాపడి గత కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడతెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల ముంగిటకే ప్రభుత్వ వైద్యం

- సాధారణ వైద్యసేవలు అన్నీ గ్రామంలోనే
- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం
- వైద్య సేవలకు ప్రభుత్వం పెద్ద పీట

నియోజకవర్గంలో	
మండలాలు	: 3
మున్సిపాలిటీ	: 1
నగర పంచాయతీ	: 1
పీహెచ్‌సీలు	: 4
సీహెచ్‌సీ	: 1
ప్రభుత్వాసుపత్రి	: 1
విలేజ్ క్లినిక్‌లు	: 57
నెలకు ఆయా కేంద్రాల ద్వారా వైద్యం పొందుతున్న రోగులు	: 34,200

కంకిపాడు: ఒకప్పుడు చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా మండల కేంద్రానికో, ఆరోగ్య కేంద్రానికో పరుగులు తీయాల్సి వచ్చేది. క్షేత్రస్థాయి సిబ్బంది ఏ రోజు ఎక్కడ ఉన్నారో కూడా తెలిసేది కాదు. పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విధానాన్ని పూర్తిగా మార్పు చేశారు. ప్రజల వద్దకే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల స్థాపన, సిబ్బంది నియామకంతో పల్లెల్లోనే వైద్యం సమర్థంగా అందుతోంది. ఆరోగ్య ప్రమాణాల వృద్ధికి ప్రభుత్వం కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోంది.

నియోజకవర్గంలో వైద్య సేవల పరిస్థితి....

పెనమలూరు నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. మూడు మండలాలు, ఒక నగర పంచాయతీ, ఒక మున్సిపాలిటీ ఉన్నాయి. ఒక ప్రభుత్వాసుపత్రి, నాలుగు పీహెచ్‌సీలు, ఒక సిహెచ్‌సి, ఒక అర్బన్ హెల్త్ క్లినిక్ ఉన్నాయి. పెనమలూరులో 30, కంకిపాడులో 17, ఉయ్యూరులో 10 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలోనూ 14 రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ రకాల వ్యాధులకు సంబంధించి 105 రకాల మందులను ఆయా క్లినిక్‌లలో అన్ని వేళలా అందేలా సిద్ధంగా ఉంచింది. నియోజ కవర్గంలో 57 క్లినిక్‌లు ఉంటే వీటిలో 9 కేంద్రాలు నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో కేంద్రం రూ.17.50 లక్షలు అంచనాతో నిర్మాణం చేపట్టారు. ఉయ్యూరు అర్బన్ హెల్త్ క్లినిక్ రూ. 1.03 కోట్లతో నిర్మాణం జరుగుతోంది. నిర్మాణాలు పూర్తయితే సకల వసతులతో పల్లెల్లోనే మెరుగైన వైద్యం పూర్తి స్థాయిలో అందుతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.



ఉయ్యూరు మండలంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



విలేజ్ క్లినిక్‌లోనే వైద్యం



విలేజ్ క్లినిక్‌లు గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయి. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా సిబ్బంది అవసరమైన నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదు. వైద్యం కోసం ఎంతో ఖర్చుచేయాల్సి వచ్చేది. ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయటం ఎంతో మంచి నిర్ణయం.

సాజన్, గంగూరు

సేవలు మెరుగు



ఒకప్పుడు శివారు గ్రామాల నుంచి ప్రజలు పీహెచ్‌సీలకు వచ్చే వారు. విలేజ్ క్లినిక్‌లతో చాలా వరకూ స్థానికంగానే వైద్యసేవలు పొందుతున్నారు. ఒక్కో క్లినిక్‌లో 350 నుంచి 550 మంది వరకూ ప్రతి నెలా వైద్య సేవలు అందుకుంటున్నారు. అత్యవసర సేవలకు పీహెచ్‌సీకి వస్తున్నారు. వైద్యసేవలు ఎంతో మెరుగు పడ్డాయి.

డాక్టర్ సుందర్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ ఉప్పులూరు

పల్లెకు ఆరోగ్య భరోసా

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పిస్తున్నాయి. ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు దూరాన ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇవి ఏర్పాటైనప్పటి నుంచి గన్నవరం నియోజకవర్గంలో అనేక మంది సేవలు పొందారు. విలేజ్‌క్లినిక్‌లలో 14 రకాల పరీక్షలు చేయడంతోపాటు 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాల నిర్మాణాలను చేపట్టింది.



కాకులపాడులోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్

గన్నవరం నియోజకవర్గంలో...

మొత్తం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	: 56
సేవలు అందిస్తున్న సిబ్బంది	: 561
ఇప్పటి వరకు అందించిన ఓపీ సేవలు	: 1,84,127 మందికి
మొత్తం టెస్ట్‌ల సంఖ్య	: 74,979
టెలి కన్సల్టేషన్ల సంఖ్య	: 91,513

మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలతో గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతి విలేజ్ క్లినిక్‌లోనూ సాధారణ ఓపీ నిర్వహించి, మందులు అందిస్తున్నాం. అవసరమైతే వైద్య పరీక్షలు నిర్వహించటం, టెలి కన్సల్టేషన్ ద్వారా చికిత్స అందిస్తున్నాం. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వెళ్లి ఇంటింటికి వైద్యం అందిస్తున్నాం.

–డాక్టర్ కిరణ్మయి, వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

మా ఊరిలోనే వైద్య సేవలు



గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మా గ్రామంలో సరైన వైద్య సదుపాయం లేకపోవటంతో మండల కేంద్రమైన బాపులపాడు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఊర్లోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేయటం ఎంతో సంతోషంగా ఉంది. విలేజ్ క్లినిక్‌లోనే చిన్న, చిన్న జబ్బులకు వైద్యం పొందుతున్నాం. దీనికి తోడు ప్రతి నెలా పీహెచ్‌సీ నుంచి డాక్టర్లు కూడా ఇక్కడే వచ్చి వైద్యం అందిస్తున్నారు.

–నెదిరి చుక్కమ్మ, శేరినరసన్నపాలెం

వికలాంగుడికి ట్రై సైకిల్ బహూకరణ

పెనమలూరు: గంగూరు గ్రామంలో వికలాంగుడికి ట్రైసైకిల్ ఆదివారం అందించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు వైఎస్సార్ సీపీ నేత అక్బర్‌బాషా, వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బంగారు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు అధినేత యలమంచిలి జయప్రకాష్ ట్రైసైకిల్ వికలాంగుడు సంతోష్‌కుమార్‌కు అందచేశారు. పార్టీ మండల కన్వీనర్ కిలారు శ్రీనివాసరావు, నేతలు దామోదరరావు, జాన్‌బాబు పలువురు పాల్గొన్నారు.



ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

కరాటేలో 24 మంది విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జెకె గోజురియో కరాటే అకాడమీలో ఆదివారం విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 24 మంది విద్యార్థులు వైట్ బెల్ట్ నుంచి ఎల్లో బెల్ట్, ఎల్లో బెల్ట్ నుంచి ఆరంజ్, ఆరంజ్ నుంచి గ్రీన్ బెల్ట్, గ్రీన్ నుంచి బ్లూ, బ్లూ నుంచి పర్పుల్ బెల్ట్, పర్పుల్ బెల్ట్ నుంచి బ్రౌన్ 4, 3, 2 బెల్ట్స్ వరకు ప్రమోట్ అయ్యారు. ఈ సందర్భంగా కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్) సెక్రటరీ జె.శ్రీనివాసులు వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థులను అభినందిస్తూ కరాటే విద్య అనేది విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. చదువుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఖాళీ సమయాల్లోనే కరాటే విద్యను నేర్చుకోవచ్చన్నారు. వివిధ బెల్ట్‌లను పొందిన విద్యార్థులు మరింత రాణించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించిన వారిలో కాయ్ ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు, హెడ్ కోచ్ జె.హరినాథ్, సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ పీవీకెఎస్ హర్ష, 40వ డివిజన్ కార్పొరేటర్ యర్రగ్గ ఆంజనేయరెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో శ్రీనివాసులు, హర్ష తదితరులు

లయన్స్ క్లబ్ ద్వారా విస్తృత సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్స్ ద్వారా ప్రజలకు విస్తృతమైన సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ అన్నారు. విజయవాడ రోడ్డులోని లయన్స్ క్లబ్ హాల్లో నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్ నేతృత్వంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా చలసాని వెంకటేశ్వరరావు, అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారిగా కొల్లేపల్లి నారాయణరావు ప్రమాణస్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ గ్లోబల్ అధ్యక్ష, కార్యదర్శులుగా కనిగంటి రంగారావు, కొండపావులూరి రామ్మోహనరావు, కోశాధికారిగా గుమ్మడి శేషగిరిరావులు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆశాజ్యోతి గ్లోబల్ అధ్యక్ష, కార్యదర్శులుగా భూమా భాను సంపత్‌కుమార్, అంపోలు రాములు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, జిల్లా వైస్ గవర్నర్‌లు గద్దె శేషగిరి, వీవీపీఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు.

అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని సరస్వతీ సామాజ్య అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం అంతరిక్ష వారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ విజయాలు, ప్రయోగాలు, స్పేస్ షిప్ తదితర అంశాలను వివరించారు. ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. చంద్రయాన్-3 భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్ర యాత్ర అన్నారు. చంద్రయాన్ కార్యక్రమంలో ఇది మూడోవదని, చంద్రయాన్-2 లో మాదిరిగా ఇందులో కూడా రోవర్, ఒక ల్యాండర్ ఉన్నాయన్నారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలోనూ మానసిక సమస్యలు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలతో సతమతమవుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. మానసిక సమస్యలు ఉన్న వారికి ఇండ్లాస్ చక్కని చికిత్సా కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన ఇండ్లాస్ చెల్త్ అండ్ గైడెన్స్ క్లినిక్‌ను ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల కారణంగా కొందరు, సామాజికంగా అనేక కారణాలతో మానసిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లిదండ్రుల బిజీ లైఫ్ కారణంగా పిల్లలను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, వైద్యులు ఆర్.వెంకటేశ్వరరావు, ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశాల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా రీసర్వే

విజయవాడరూరల్: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే ముమ్మరంగా జరుగుతోంది. అంబాపురం, పి.నైనవరం వేమవరం, కొత్తూరు, తాడేపల్లి, షాబాదు, జక్కంపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో ప్రత్యేక బృందాల ద్వారా రీ సర్వే చేస్తున్నారు. రోవర పరికరం ద్వారా కొలతలను వేగంగా చేస్తున్నామని మండల సర్వేయర్ రమేష్ తెలిపారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను ముందుగా రెవెన్యూ రికార్డు ప్రకారం గుర్తించి వాటి వివరాలను గ్రామ సర్వేయర్ లాగిన్‌లో ఎంటర్ చేస్తారన్నారు. పట్టా భూములను రైతుల సమక్షంలోనే రికార్డు ఆధారం, అనుభవదారు రికార్డు ప్రకారం రీసర్వే కొలతలు కొలవడం ఆన్‌లైన్లో ఎంటర్ చేస్తారన్నారు. రీసర్వే పూర్తయిన రైతులకు ఎల్‌పీ నెంబర్లు ఇస్తారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో భూముల యజమానులు దూరప్రాంతాల్లో ఉండటంతో వారు రావడం ఆలస్యమవుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రీసర్వే కొలతలకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని వివరించారు. మండలంలోని 19 గ్రామాల్లో 45వేల ఎకరాలున్నాయని, త్వరితగతిన రీసర్వే పూర్తి చేయడానికి జి.కొండూరు, గంపలగూడెం, తిరువూరు లాంటి మండలాల నుంచి గ్రామ సర్వేయర్లను ఏర్పాటు చేసి కొలతలను తీస్తామన్నారు. తహసీల్దార్ పి.జాహ్నవి రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి పర్యవేక్షణ ఉంటుందన్నారు.



పి.నైనవరంలో రీ సర్వే చేస్తున్న సిబ్బంది

సేవా కార్యక్రమాలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వారంతా గ్రూపుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని ఐసీడీఎస్ గన్నవరం సీడీపీవో వెంకటలక్ష్మి అన్నారు. 'మమతల పందిరి' ఫేస్‌బుక్ గ్రూపు 2వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాపులపాడు మండలం వేలేరులోని వంగల బాలాజీ కల్యాణ మండపంలో ఉత్సాహభరితంగా జరిగింది. తెలుగురాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గ్రూపు సభ్యులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులంతా కలిసి అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 15 మంది గర్భిణులకు శాస్త్రోక్తంగా సీమంతం చేశారు. మమతల పందిరి ఫేక్‌బుక్ గ్రూపు ద్వారా రెండేళ్లుగా సేవలు చేస్తున్న గ్రూపు వ్యవస్థాపకుడు లంక రమేష్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.



గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న సభ్యులు

క్యాన్సర్ రాకుండా అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కానూరు అమెరికన్ అంకాలజీ వైద్యుడు క్రాంతికుమార్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, ఊబకాయం, సకాలంలో ఆహారం తీసుకోక పోవటం, శారీరక వ్యాయామం చేయక పోవటం వంటి కారణాలతో క్యాన్సర్ రావటానికి అవకాశం ఉంటుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రూప్‌కుమార్, కార్యదర్శి సతీష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పలువురు పాల్గొన్నారు.

సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయం

విజయవాడకల్చరల్: దివంగత సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయమని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత సాహితీమూర్తులు ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ సంస్మరణ సభను గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పెనుగొండ మాట్లాడుతూ.. తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరని తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేవన్నారు. సంగీత సాహిత్య విమర్శకుడు పన్నాల సుబ్రహ్మణ్య శ్రీ రమణ గురించి మాట్లాడుతూ రాసికన్నా వాసికి ప్రాధాన్యత నిచ్చిన సాహితీ దిగ్గజం శ్రీరమణ అని అభివర్ణించారు. పేరడీ కవిత్వానికి దిశానిర్దేశం చేసిన శ్రీరమణ తన కథల ద్వారా అద్భుతాలనే సృష్టించారన్నారు. ఆయన ప్రతిభకు మచ్చుతునక మిథునం కథ చాలన్నారు. సభను సమన్వయ పర్చిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మనుషులు కనుమరుగైనా వారి సాహిత్యం సజీవంగానే ఉంటుందన్నారు. సంస్మరణ సభలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర నాయుడు, సభ్యులు బెల్లపు బాబ్జీ, పల్లవి వెంకట నారాయణ, గుత్తికొండ లక్ష్మి, లక్ష్మయ్య, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. సాహితీవేత్తలు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ చిత్రపటాలకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్య భట్టు, వేదికపై లక్ష్మీనారాయణ, గోళ్ల నారాయణరావు

30న 'కథ చెబుతారా ..ఊ కొడతాం' పోటీలు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం కథ చెబుతారా.. ఊ కొడతాం ధార్మిక కథల పోటీ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ధర్మపరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం అధ్యాపకులు, న్యాయనిర్ణేతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలో ఒకటో నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పాల్గొనాలని కోరారు. కథలు, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, భారతీయ సంస్కృతి సంప్రదాయలకు సంబంధించి కథలు ఉండాలని సూచించారు. జిల్లా ధార్మిక పరిషత్ సభ్యులు రమణారావు, బాల కోటేశ్వరరావు, మంగిపూడి వెంకటశాస్త్రి, ఉప్పులూరు శేషప్రసాద్, విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ధర్మప్రచార పరిషత్ సభ్యులు

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేక పూజలు



గన్నవరం: పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారి సన్నిధిలో భక్తులు శ్రీలలిత సహస్ర నామ పారాయణం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మి(మాను)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మకు గాజులతో అలంకరణ చేశారు.